## క్లుప్తంగా

### నేడు నరేన్ గార్డెన్‌లో బీఆర్ఎస్ ప్రతినిధుల సభ

గచ్చిబౌలి: బీఆర్ఎస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గం ప్రతినిధుల సభ మంగళవారం ఉదయం పది గంటలకు మియాపూర్‌లోని నరేన్‌గార్డెన్‌లో జరుగుతుందని ఎమ్మెల్యే గాంధీ తెలిపారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులు, బీఆర్ఎస్ పార్టీ అనుబంధ సంఘాల ప్రతినిధులు అంతా విధిగా హాజరుకావాలని ఆయన సూచించారు.

### ● నేడు 'సంత' జరిగే ప్రాంతాలు

వారాంతపు సంతల నిర్వహణలో భాగంగా శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో మంగళవారం గోపీనగర్, ఖాజాగూడలలో ఉదయం 10 నుంచి రాత్రి 7 గంటల వరకు సంత సాగుతుంది. తాజా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, నిత్యావసరాలు, దుస్తులు, ఇతర వస్తువులు లభిస్తాయి.

### ● రైల్వే సమాచారం

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వేస్టేషన్ నుంచి హైదరాబాద్, సికింద్రాబాద్, ఫలక్‌నామాలకు వెళ్ళే ఎంఎంటీఎస్ రైళ్ల వేళలు ఇలా వున్నాయి.

నాంపల్లి వైపు :
ఉదయం: 6:40, 7:40, 8:10, 9:15, 10:15, 11:10 , 11:55
మధ్యాహ్నం: 12:50 , 13:20 , 14:25, 15:20
సాయంత్రం: 16:10, 17:55
రాత్రి: 18:55, 20:05, 21:25
సికింద్రాబాద్ వరకు: రాత్రి 22:50, 23:25
ఫలక్‌నామా వైపు:
ఉదయం: 5:50, 6:30, 6:50, 8:25, 9:05, 9:31, 10:05, 11:20 , 11:40.
మధ్యాహ్నం: 12:40, 13:25, 14:40, 14:55 , 15:10
సాయంత్రం: 16:35, 17:10, 17:30, 18:00,18:35
రాత్రి: 19:10, 19:55, 21:00, 21.15, 21:45.

### ● పాజిటివ్ కేసులు నిల్

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం 27 మందికి కొవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా అందరికీ నెగెటివ్ వచ్చినట్టు టెస్టుల నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. 25 మందికి ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహించామన్నారు.

### ఉచిత ఆరోగ్య కేంద్రం

హఫీజ్‌పేట్: కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో నాదెళ్ళ లక్ష్మయ్య మెమోరియల్ ఆరోగ్యం కేంద్రం ఉంది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయి. అవుట్ పేషంట్‌కు రూ.30లు చెల్లించాలి. ప్రతి రోజు సుమారు 25 మంది రోగులకు వైద్య పరీక్షలు అందిస్తారు. ఉచితంగా మందులు, మైనర్ ఆపరేషన్లు కూడా కేంద్రంలో నిర్వహిస్తారు. ఆదివారం ఆరోగ్య కేంద్రానికి సెలవు.

### 27న నిధి ఆప్‌కే నిఖత్

పటాన్‌చెరు టౌన్: భవిష్యనిధి సంస్థ ద్వారా ప్రతి నెలా సమస్యల పరిష్కారానికి ఫిర్యాదుల్లో భాగంగా నిధి ఆప్‌కే నిఖత్ -2.0 ఈ నెల 27న నిర్వహించనున్నట్లు ప్రాంతీయ కమిషనర్ విశాల్ అగ్రవాల్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడు కేంద్రాల్లో మూడు శిబిరాలు ఉదయం 9:30 గంటల నుంచి 5:45 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

- రంగారెడ్డి జిల్లా మదీనాగూడ వద్ద హెచ్ఐజీ ఫేజ్-2 ఉషోదయ ఎన్‌క్లేవ్ సొసైటీ,
- సంగారెడ్డి జిల్లాకు గాను ఐడీఏ బొల్లారం సాయిబాబ టెంపుల్ ఫంక్షన్‌హాల్
- మెదక్ జిల్లాకు సంబంధించి సంగారెడ్డి మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ నెలలో ఉద్యోగ విరమణ పొందుతున్న ఈపీఎఫ్ చందాదారులకు ప్రాంతీయ కమిషనర్ చేతుల మీదుగా పింఛను మంజూరుపత్రాలను అందజేయనున్నట్లు వివరించారు. భవిష్యనిధి సమస్యలు ఉన్నవారు పైమూడు కేంద్రాల్లో హాజరై సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు.

### బీజేపీ నాయకుల పర్యటన



పాదయాత్రలో పాల్గొన్న బీజేపీ నాయకుడు యోగానంద్

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ పార్ట్ హనుమాన్‌నగర్‌లో సోమవారం బీజేపీ సీనియర్ నాయకుడు యోగానంద్ పర్యటించారు. ఈ సందర్భంగా యోగానంద్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి శూన్యమని ఆరోపించారు. అబద్ధపు బ్రాండ్ అంబాసిడర్ కేసీఆర్ అని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రజల సొమ్మును దోచుకుంటుంటే, శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే గాంధీ దోచుకుంటున్నారని విమర్శించారు. ప్రజలకు అభివృద్ధిని, సంక్షేమాన్ని అందించడంలో విఫలమైన ప్రభుత్వానికి ప్రజలు త్వరలో బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో సురభి రవీందర్‌రావు, భూపాల్‌రెడ్డి, విజిత్ వర్మ, సురేందర్‌రెడ్డి, పర్వతాలు యాదవ్, మహేందర్, విశ్వకర్మ, గోవర్ధన్‌చారి, ప్రభాకర్ యాదవ్, పుష్పాల ప్రభాకర్ పాల్గొన్నారు.

# అసంపూర్తి పనులు.. అవస్థలు





మంజీరా రోడ్డును తవ్వి వదిలేసిన దృశ్యాలు

- చందానగర్ మంజీరా రోడ్డులో అసంపూర్తిగా పైప్‌లైన్ పనులు
- పూర్తయిన చోట బాగు చేయక పోవడంతో గుంతలు పడ్డ రోడ్లు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, పాదచారులు



కుంగిన మ్యాన్‌హోల్



ఎంఏనగర్-కృషీనగర్ రోడ్డుకు పగుళ్లు

మియాపూర్: అసంపూర్తి పనులతో ప్రజలు అవస్థలుపడుతున్నారు. ప్రధాన రహదారిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైపులైన్ పనుల కోసం రోడ్డును మధ్యలో తవ్వి సగం వరకు పనులు చేసి వదిలేశారు. రోడ్డును తవ్వి పైపులైన్‌లు వేసిన చోట మరమ్మతులు చేయకపోవడంతో రోడ్డు మధ్య గుంతలు ఏర్పడ్డాయి. సంవత్సరాలు గడిచినా పనులు పూర్తి కాకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

- చందానగర్‌లోని మంజీరా పైపులైన్ రోడ్డులో ఇండియన్ గ్యాస్ గోడౌన్ ముందు నుండి క్రిస్టల్ గార్డెన్ వరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను చేపట్టారు. పనుల నిమిత్తం రోడ్డును మధ్యలో తవ్వి పైపులైన్‌లను వేశారు. అదేవిధంగా కొద్ది దూరం వరకు పైపులైన్ పనుల కోసం రోడ్డును తవ్వి పైపులైన్ వేయకుండా వదిలేశారు.
- తవ్విన చోట మరమ్మతులు చేయకుండా వదిలేశారు.
- సంవత్సరం నుంచి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తి కాకపోగా కనీసం పైపులైన్ వేసిన వరకు రోడ్డును బాగుచేయకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- ఇక రోడ్డు కంటే ఎత్తులో మ్యాన్‌హోళ్లు ఏర్పాటు చేయడంతో కార్లు, ఇతర వాహనాలకు కిందిభాగంలో తగలడంతో డ్యామేజీ అవుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు.
- శేరిలింగంపల్లి జాతీయ రహదారిపై బీహెచ్ఈఎల్ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు చేపట్టడంతో కొంతదూరం జాతీయ రహదారిపై తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆ ట్రాఫిక్ ఇబ్బందిని తప్పించుకునేందుకు కొందరు వాహనదారులు మంజీరా రోడ్డును ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. ఈ రోడ్డు గుంతలమయంగా మారడంతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

#### సీసీ రోడ్లు.. పగుళ్లు, గుంతలు

మెరుగైన రవాణా సౌకర్యం కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలతో బస్తీ, కాలనీల్లో సీసీ రోడ్లు వేస్తోంది. అయితే పనుల్లో నాణ్యత, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వేసిన కొన్నిరోజులకే పగుళ్లు వచ్చి గుంతలు ఏర్పడుతున్నాయి. దీంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందిపడుతున్నారు. పనులపై పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్లు ఇష్టమొచ్చినట్లు పనులు చేస్తున్నారని ఫలితంగా రోడ్లు, మ్యాన్‌హోళ్లు కుంగిపోతున్నాయని.. ఇందుకు ఎంఏనగర్- కృషీనగర్ కాలనీల మధ్య సీసీ రోడ్డే నిదర్శనమని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఏడాదిన్నర క్రితం సుమారు కోటిన్నరతో మియాపూర్ డివిజన్ పరిధిలోని ఎంఏనగర్-కృషీనగర్ రోడ్డు పనులు చేపట్టారు. పనుల్లో నాణ్యత లేకపోవడంతో రోడ్డు బీటలువారగా మ్యాన్‌హోళ్లు కుంగిపోయాయి.

## బీజేపీ పాదయాత్రలకు అనూహ్య స్పందన

మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్



కార్యక్రమంలో మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, రవికుమార్ యాదవ్

గచ్చిబౌలి: బీజేపీ పాదయాత్రలకు ప్రజలనుంచి అనూహ్య స్పందన వస్తోందని పార్టీ సీనియర్ నాయకులు, మాజీ పార్లమెంటు సభ్యులు బూరనర్సయ్యగౌడ్ పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ నాయకత్వంలో కొండాపూర్ డివిజన్‌లో గడపగడపకూ బీజేపీ పేరిట చేపట్టిన పాదయాత్ర కార్యక్రమంలో ఆయన సోమవారం రాత్రి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీజేపీ గెలుపు కోసం అందరూ సమిష్టిగా కృషి చేయాలన్నారు. రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ కొండాపూర్ డివిజన్‌లో అనేక సమస్యలు తమ దృష్టికి వచ్చాయని వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. బీజేపీ సీనియర్ నాయకులు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి, రాఘవేంద్రరావు, ఆంజనేయులు,, వెంకటేష్‌యాదవ్, మల్లేష్‌యాదవ్, ఎల్లేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## పాంక్రియాటిక్ కేన్సర్‌కు లాప్రోస్కోపిక్ శస్త్ర చికిత్స

కొండాపూర్ కిమ్స్ వైద్యుల ఘనత



కోలుకున్న రోగితో డాక్టర్లు నవీన్, మధులిక

గచ్చిబౌలి: కొండాపూర్ కిమ్స్ ఆస్పత్రిలో పాంక్రియాటిక్ కేన్సర్‌కు లాప్రోస్కోపిక్ శస్త్ర చికిత్స చేసినట్లు కన్సల్టెంట్ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్టులు డాక్టర్ నవీన్, డాక్టర్ మధులిక తెలిపారు. ఖమ్మం జిల్లాకు చెందిన ఓ వ్యక్తి(49)కి పచ్చకామెర్లు, బరువు తగ్గడం లాంటి సమస్యలతో చాలా ఆస్పత్రులకు వెళ్లి, చివరకు కొండాపూర్ కిమ్స్‌కు రాగా పరీక్షలు నిర్వహించి పాంక్రియాటిక్ క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారణ కావడంతో విపుల్స్ ప్రొసీజర్ లాప్రోస్కోపిక్ చికిత్స చేయాలని నిర్ణయించామని తెలిపారు. ఆరు గంటల పాటు శ్రమించిన డాక్టర్లు విజయవంతంగా పూర్తి చేశామన్నారు. రోగి త్వరగా కోలుకోవడంతో వారం రోజుల్లోనే డిశ్చార్జి చేసి ఇంటికి పంపించామని పేర్కొన్నారు. ఓపెన్ శస్త్ర చికిత్సల కంటి ల్యాప్రోస్కోపిక్ శస్త్ర చికిత్సల వల్ల జీవన ప్రమాణం మెరుగ్గా ఉంటుందని డాక్టర్ నవీన్ తెలిపారు.

## సీఈఐఆర్ ద్వారా 4 ఫోన్‌లు, ల్యాప్‌టాప్ పట్టివేత



ఫిర్యాదుదారులకు సెల్‌ఫోన్‌లను అందజేసిన ఇన్‌స్పెక్టర్ తిరుపతి, డీఐ వెంకట్

మాదాపూర్: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సీఈఐఆర్ ( సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిఫికేషన్ రిజిస్టర్) పోర్టల్‌ను ఉపయోగించి పట్టుకున్న ఫోన్‌లను మాదాపూర్ పోలీసులు ఫిర్యాదుదారులకు సోమవారం అందజేశారు. మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ తిరుపతి, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ జి.వెంకట్ మాట్లాడుతూ పోర్టల్ ద్వారా నాలుగు సెల్‌ఫోన్‌లను, ఒక ల్యాప్‌టాప్‌ను కనిపెట్టి వారికి అందజేశామన్నారు. ఎవరైనా తమ ఫోన్‌లను పోగొట్టుకుంటే సీఈఐఆర్ పోర్టల్‌లో ఫోన్ వివరాలను నమోదు చేయాలన్నారు. బాధితులు ఈ పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## డ్రైవర్ నిర్లక్ష్యం..బాలుడికి తీవ్రగాయాలు

మియాపూర్: ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సు డ్రైవర్ అజాగ్రత్తగా బస్సు నడపంతో ఓ బాలుడికి తీవ్రగాయాలయ్యాయి. మియాపూర్ ఎస్ఐ యాదగిరిరావు తెలిపిన వివరాల ప్రకారం... కర్ణాటక రాష్ట్రానికి చెందిన శివకాంత్-శాలు దంపతులు నగరానికి వలస వచ్చి హఫీజ్‌పేటలోని ప్రభుత్వ పాఠశాలలో ఉంటూ అక్కడే వంటపని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. వీరికి జ్యోతి, శకుంతల, వీరభద్రేశ్వర్‌రావు సంతానం . వీరభద్రేశ్వర్‌రావు అదే పాఠశాలలో 4వ తరగతి చదువుకుంటున్నాడు. ఆదివారం రాత్రి శివకాంత్, ఆయన కుమారుడు వీరభద్రేశ్వర్‌లు పాఠశాలలోవారు ఉండే గది ముందు నిద్రించారు. అయితే పాఠశాల ఆవరణలో ప్రైవేటు వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. సోమవారం ఉదయం నాలుగు గంటల ప్రాంతంలో శ్రీసాయి గణేష్ ట్రావెల్స్ బస్సును పార్కింగ్ నుంచి వెనక్కి తీస్తున్న సమయంలో డ్రైవర్ వెనక చూసుకోకుండా పాఠశాల గది ముందు పడుకున్న వీరభద్రేశ్వర్‌పైకి ఎక్కించాడు. దీంతో నడుము భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. శివకాంత్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## సెల్‌ఫోన్ దొంగలపై కేసులు నమోదు



రాజు, క్రాంతి

మాదాపూర్: వేర్వేరు ప్రాంతాలలో రెండు సెల్‌ఫోన్‌లను దొంగిలించిన యువకులపై మాదాపూర్ పోలీసులు కేసులు నమోదు చేశారు. మాదాపూర్ ఐటీ జి.వెంకట్ తెలిపిన వివరాల ప్రకారం మాదాపూర్‌లోని పర్వత్‌నగర్‌కి చెందిన బోకుల రాజు(19), కంజేర్ల క్రాంతిలు వ్యసనాలకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో పర్వత్‌నగర్ వద్ద ఉన్న ఆర్ఆర్ఆర్ వైన్స్ వద్ద ఓ వ్యక్తి వద్ద నుండి, డీమార్ట్ వద్ద మహిళ నుండి సెల్‌ఫోన్‌లను దొంగిలించారు. సోమవారం నిందితుల వద్ద నుండి రెండు సెల్‌ఫోన్‌లను, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశారు.

## చందానగర్‌లో చైన్ స్నాచింగ్

బైక్‌పై వచ్చి మహిళ మెడలోంచి 4 తులాల మంగళసూత్రం అపహరణ

మియాపూర్: రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలోంచి బంగారు మంగళసూత్రాన్ని గుర్తుతెలియని దుండగులు ద్విచక్ర వాహనంపై వచ్చి లాక్కొని వెళ్లిన సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం... చందానగర్ హుడా కాలనీలో నివాసముంటున్న శ్యామలదేవి(50) ఆదివారం రాత్రి చందానగర్ గంగారంలోని కేఎల్ఎం మాల్‌లో షాపింగ్ చేసి ఆటోలో ఇంటికి వెళ్లింది. పీజేఆర్ స్టేడియం వద్ద రాత్రి 9 గంటలకు ఆటో దిగి నడుచుకుంటూ వెళ్తుండగా పల్సర్ ద్విచక్ర వాహనంపై వచ్చిన వ్యక్తి వెనుక నుంచి ఆమె మెడలోంచి నాలుగు తులాల బంగారు మంగళసూత్రాన్ని లాక్కొని పారిపోయాడు. దీంతో ఆమె చందానగర్ పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సోమవారం ఘటన స్థలాన్ని మాదాపూర్ జోన్ డీసీపీ శిల్పవల్లి, పోలీస్ సిబ్బంది పరిశీలించారు.

## హెచ్‌సీయూ ప్రొఫెసర్లకు సెర్బ్-స్టార్



ప్రొ. చంద్రశేఖర్



ప్రొ.విజయకనవాడే

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన ఇద్దరు ప్రొఫెసర్లకు అరుదైన గౌరవం లభించింది. సెర్బ్ సైన్స్ అండ్ టెక్నాలజీ అవార్డు( సెర్బ్-స్టార్) వారికి లభించింది. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ కెమిస్ట్రీ ప్రొఫెసర్ రాజదురై చంద్రశేఖర్, స్కూల్ ఆఫ్ ఫిజిక్స్‌లోని సెంటర్ ఆఫ్ ఎర్త్, ఓషన్ అండ్ అట్మాస్పియరిక్ సైన్సెస్‌లోని యూజీసీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ విజయకనవాడేకు అవార్డు లభించింది. పరిశోధన కోసం (సెర్బ్-స్టార్) సెర్బ్ ద్వారా స్థాపించబడింది.

## 'ముఖాముఖి'తో సమస్యలు పరిష్కారం

పటాన్‌చెరు టౌన్: ప్రజలతో ముఖాముఖి కార్యక్రమం (పబ్లిక్ కాంట్రాక్ట్ ప్రోగ్రాం)తో ఆయా కాలనీలలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని జీహెచ్ఎంసీ డీఈ క్రాంతి అన్నారు. సోమవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని చైతన్యనగర్ కాలనీలోని బాబు జగ్జీవన్ ఫంక్షన్ హాల్‌లో కాలనీవాసులతో కలిసి అధికారులు పబ్లిక్ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు తమ సమస్యలను అధికారులకు వివరించగా స్పందించిన అధికారులు సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీవాసులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతున్న కార్మికుడు మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ ఓ కార్మికుడు మృతిచెందిన సంఘటన భానూర్-బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బీడీఎల్ ఎస్ఐ సాయిలు కథనం ప్రకారం.. కొలంపేటకు చెందిన పొలిమేర కృష్ణ రాములు(60) పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామికవాడలోని ఓ కంపెనీలో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 7వ తేదీన పనిచేసే చోట గ్యాస్ ప్లాంట్ డ్యామేజ్ కాగా వేడి నీరు కృష్ణ రాములు శరీరంలోని మెడ, పొట్ట, కాళ్లు, చేతులపై పడటంతో బొబ్బలు వచ్చాయి. దీంతో పరిశ్రమ నిర్వాహకులు ఇస్నాపూర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం కంచాన్‌బాగ్ అపోలో డీఆర్‌డీఓ ఆస్పత్రిలో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడు. సమాచారం తెలుసుకు న్న పోలీసులు ఆస్పత్రికి చేరు కొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## మనం నిస్సహాయులం కాదు

హెచ్‌సీయూ ప్రొఫెసర్ ప్రమోద్ కె.నాయర్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ ప్రమోద్ కె.నాయర్

పటాన్‌చెరు టౌన్: మనమందరం దుర్బలులమే కానీ, నిస్సహాయులం కాదని హెచ్‌సీయూ ప్రొఫెసర్ ప్రమోద్ కె.నాయర్ అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యూమనిటీస్ అండ్ సోషల్ సైన్సెస్‌లో 'వల్నరబిలిటీ'పై సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. పర్యావరణవాదం, మానవ హక్కులు, చట్టం తదితర విభాగాల్లో వల్నరబిలిటీ ఉందన్నారు. అంటువ్యాధులు, నిరోధక వెర్షన్లు జీవసంబంధ విపత్తులకు కారణమవుతాయని, వీటితో వాతావరణం దెబ్బతింటుందన్నారు. ఐరోపా దేశాలు రసాయన వ్యర్థాలను నదుల్లో పారబోయడంతో జలచరాలకు నష్టం వాటిల్లుతుందన్నారు. సోమాలియాలో బాలలు, సూడాన్‌లో మహిళల వల్నరబిలిటీపై వివరించారు. అనంతరం విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు జవాబులిచ్చారు. కార్యక్రమంలో జీఎస్ హెచ్ఎస్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ ప్రొఫెసర్ డీఆర్పీ చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## యువతకు స్వయం ఉపాధి శిక్షణ

రఘునాథ్ ఫౌండేషన్ ప్రారంభం

మియాపూర్: రఘునాథ్ ఫౌండేషన్‌ను ఫౌండర్, చైర్మన్ మారబోయిన రఘునాథ్ యాదవ్ సోమవారం ప్రారంభించారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని విశ్వనాథ్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. యూత్ కెన్ లీడ్ ట్యాగ్ లైన్‌తో రఘునాథ్ ఫౌండేషన్ ప్రారంభించామన్నారు. ప్రభుత్వాలకు, పార్టీలకతీతంగా యువత అన్ని రంగాల్లో రాణించే విధంగా చేయడం, పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు, వృద్ధులు, వికలాంగులు, రోగులకు ఈ సంస్థ ద్వారా ఆసరా కల్పించడమే ముఖ్య ఉద్దేశమని ఆయన తెలిపారు. అలాగే క్రీడా, వ్యాపార రంగాల్లో స్వయం ఉపాధి పొందే విధంగా శిక్షణ ఇస్తారన్నారు. కార్యక్రమంలో రఘునాథ్ ఫౌండేషన్ కమిటీ సభ్యులు సందీప్‌గౌడ్, అమర్‌నాథ్ యాదవ్, సాగర్,కరణ్‌గౌడ్,శివ, అజయ్, శ్రీకాంత్‌నాయక్, వినయ్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నాయకుల సమావేశం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా ఈ నెల 25న పటాన్‌చెరులో నిర్వహించనున్న బీఆర్ఎస్ ప్రతినిధుల మహాసభను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు అధికసంఖ్యలో తరలిరావాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ, భారతీనగర్, రామచంద్రాపురం డివిజన్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతివార్డు నుంచి కార్యకర్తలు తరలివచ్చేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. కార్పొరేటర్లు సింధుఆదర్శ రెడ్డి, పుష్పనగేష్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రాగం దేవేందర్ యాదవ్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.